జనసందోహం.. పండుగ వాతావరణం

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాకతో పులకించిన దెందులూరు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- వేలాదిగా తరలిన మహిళలు, పార్టీ శ్రేణులు


వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


పోలసానిపల్లి నుంచి భారీగా తరలి వెళ్లిన ప్రజాప్రతినిధులు, వైసీపీ శ్రేణులు


సీఎంకు స్వాగతం పలుకుతున్న జనం

దెందులూరు: అక్కాచెల్లెమ్మలకు ఆర్థిక భరోసాగా నిలిచే వైఎస్సార్ ఆసరా పథకంలో మూడో విడత నగదును మహిళల ఖాతాల్లో జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దెందులూరులో ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాకతో దెందులూరు పులకించింది. రహదారులు, వీధుల్లో కనుచూపు మేర జనసందోహం కనిపించింది. దెందులూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు శనివారం ఉదయం 7.30 గంటలకే దెందులూరులో టీటీడీ కల్యాణ మండపం పక్కన ఉన్న సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఒకవైపు జాతీయ రహదారి, మరోవైపు చెక్‌పోస్టు నుంచి దెందులూరు సీహెచ్‌సీ వరకు దారికి ఇరువైపులా బారీకేడ్లు, బ్యాడ్జీ ఆకారంలో సీఎంకు, ప్రజాప్రతినిధులకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లల్లో వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. దెందులూరు సీహెచ్‌సీ వద్ద హెలిప్యాడ్, టీటీడీ కల్యాణ మండపం పక్కన సభా స్థలం వరకు వేలాది మంది ప్రజల రాకతో దెందులూరు జనసంద్రమైంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు వారం రోజులుగా రేయింబవళ్లు శ్రమించి సమన్వయం, ప్రణాళికతో కలిసికట్టుగా చేసిన కృషి ఫలితంగా శనివారం జరిగిన సీఎం సభ విజయవంతమైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా ముఖ్యమంత్రి హోదాలో దెందులూరు నియోజకవర్గానికి రావడంతో సమీప నియోజకవర్గాల్లోని ఏలూరు, చింతలపూడి, కైకలూరు, నూజివీడు,ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాల నుంచి తండోపతండాలుగా ప్రజలు తరలివచ్చారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జిల్లా ఐటీ విభాగం చైర్మన్ గూడపాటి పవన్‌కుమార్, జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, మండల సరస్వతి, జెడ్పీ వైస్ చైర్మన్, పెదవేగి జెడ్పీటీసీ పెనుమాల విజయ్‌బాబు, గంటా పద్మశ్రీ, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మెట్లపల్లి సూరిబాబు, అప్పన్న ప్రసాద్, తేరా ఆనంద్, ఎంపీపీలు బొమ్మనబోయిన సుమలత, తాతా రమ్య, బత్తిన రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాసరాజు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పశ్యేం ప్రసాద్, ఎం.సూర్యనారాయణ, ప్రభాకరరావు, దెందూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన అక్కాచెల్లెమ్మలు

భీమడోలు: దెందులూరులో శనివారం నిర్వహించిన సీఎం జగనన్న బహిరంగ సభకు స్వచ్ఛందంగా మండలంలోని మహిళలు, వైసీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు వేలాది మందిగా వెళ్లారు. మండలంలో 28 ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, ఐదు మినీ బస్సుల్లోను సుమారు 2వేల మంది సభకు వెళ్లారు. ఎంపీడీవో జీఎల్ఎస్వీ రాఘవన్, తహసీల్దార్ షంషూద్దీన్ ఏర్పాట్లు పరిశీలించారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా, కొల్లేరు గ్రామాల్లోని మహిళలు, నాయకులు, ఎంపీపీ కనమాల రామయ్య, సర్పంచులు భలే రాంబాబు, జల్లారి వెంకట నర్సమ్మ, భీమడోలు ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు అంబటి దేవీ ప్రసాద్, గంటా శ్రీనివాస్, బొల్లారపు జ్ఞానరమ్య పవన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము సునీతామాన్‌సింగ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన నాయకులు

పెదపాడు: మండలంలోని వివిధ గ్రామాల మహిళలు భారీగా దెందులూరులో నిర్వహించిన సీఎం జగనన్న సభకు తరలి వెళ్లారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలికుడు ఘంటా ప్రసాదరావు, అప్పనవీడు ఏరియాలో పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపీచంద్రదుర్గాప్రసాద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి ఎంపీపీ బత్తుల రత్నకుమారితో పాటు వివిధ గ్రామాల నాయకులు మహిళలకు, కార్యకర్తలకు అల్పాహారాలను, బిర్యానీ ప్యాకెట్లు అందించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఆరా ఫౌండేషన్ సేవలు అభినందనీయం


భీమడోలు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆరా ఫౌండేషన్ ప్రతినిధులు

భీమడోలు: ఆరా ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వి.రవిపాల్ అన్నారు. భీమడోలు ఆరా ఫౌండేషన్ ఆర్థిక సాయంతో శనివారం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేసారు. ఆసుపత్రిలోని రోగులను ఫౌండేషన్ చైర్మన్ భావనాబుషి, ట్రస్టీ అరుణశ్రీలు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీనియర్ వైద్యులు వి.రవిపాల్, ఫౌండేషన్ ప్రతినిధులు చేతుల మీదుగా వారికి పండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ సునీత, సభ్యులు బి.రమేష్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సదుపాయాలు కల్పించాలి

గణపవరం: జగనన్న కాలనీల్లో సదుపాయాలు కల్పించాలని, ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే రూ.1.80 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలని గణపవరం మండల సీపీఎం సమావేశంలో పలువురు కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీలలో కనీస సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు ఇచ్చినా, స్థానిక అధికారులు సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. కొమ్మర కాల్వ తూము నుంచి వల్లూరు, వాకపల్లి, వీరేశ్వరపురం వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వీటిని పునర్నిర్మించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో మండల సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సూర్యం మాస్టారుకు ఎంపీ శ్రీధర్ పరామర్శ

పెదపాడు: రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు, కొత్తూరు మాజీ సర్పంచ్ ముదుగురు సూర్యనారాయణను ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్ శనివారం పరామర్శించారు. పెదపాడు మండలంలోని కొత్తూరుకి చెందిన సూర్యనారాయణ తండ్రి రాములు శుక్రవారం సాయంత్రం మరణించారు. కొంతక్రితం రాములు అనారోగ్యానికి గురై శుక్రవారం సాయంత్రం మరణించడంతో ఎంపీ శ్రీధర్‌తోపాటు పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, జిల్లా రైతు విభాగం మాజీ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, బత్తుల రత్నకుమారి ఏసురాజు, సంబంగి శ్రావణ్‌కుమార్, సాధం కిశోర్, గుణుపూరు మహేష్, కోట గోవర్ధన్ తదితరులు పరామర్శించారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

పెదపాడు: రైతులు తమ పాడి పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని డీఏహెచ్‌ఓ డాక్టరు జీ నెహ్రూబాబు సూచించారు. మండలంలోని నాయుడుగూడెంలో టీకాలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాలికుంటు టీకాలు తప్పని సరిగా వేయించాలని సూచించారు. శనివారం నాటి కార్యక్రమంలో 523 గేదెలకు టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీటీ గోవిందరాజు, అతనపు ఏడీ డాక్టరు ఏ సుచరిత, పెదపాడు మండల పశువైద్యాధికారి డాక్టరు సీహెచ్ వాణీ సంధ్య, జేవీఓ ఎం ఫణి కుమార్, ఎల్ఎస్ఏ కే శ్రీదేవి, ఎండీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు క్షీరాభిషేకం


దెందులూరులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దెందులూరు: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానించడం చరిత్రాత్మక విషయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు. శనివారం దెందులూరు పెదదళితపేటలో వైఎస్సార్ సీపీ, మాలమహానాడు సంయుక్త ఆధ్వర్యంలో కృతజ్ఞతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొరపాటి రత్నకిషోర్, గుడిపూడి శేఖర్‌బాబు, గుంపుల ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

పెదపాడు: స్థానిక సత్యన్నారాయణ పురంలో కోదండరామ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. ఉదయం ఆలయం వద్ద కిలారి రఘు దంపతులతో చండీహోమం నిర్వహించారు. స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా తయారు చేసిన ప్రత్యేక ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. దాతల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

బీజేపీ విధానాలకు నిరసనగా చలో ఢిల్లీ


పాతూరు గోడౌన్ వద్ద గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్.లింగరాజు తదితరులు

భీమడోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు సివిల్ సప్‌లైయిస్ గుడౌన్ వద్ద శనివారం హమాలీ కార్మికులతో కలిసి ఆయన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 26 నుంచి నాలుగు రోజుల పాటు జిల్లాలోని 27 మండలాల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రసాద్, దుర్గారావు, రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకటరమణ మృతి తీరని లోటు


సంస్మరణ సభలో మాట్లాడుతున్న వీరభద్రాచారి

ఏలూరు (టూటౌన్): కెల్లా వెంకటరమణ మృతి వడ్రం పనివార్ల ఉద్యమానికి, చేతి వృత్తిదారుల ఉద్యమానికి తీరని లోటని వడ్రం పనివార్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మారేడిపూడి వీరభద్రాచారి, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, ఏపీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పేర్కొన్నారు. వడ్రం పనివార్ల సంక్షేమ సంఘం ఏలూరు నగర అధ్యక్షుడు వెంకటరమణ సంస్మరణ సభ స్థానిక సత్రంపాడులోని ఆయన నివాసంలో సంఘం నగర కార్యదర్శి కొత్తల శివకుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సంఘం నాయకులు హరి సత్యనారాయణ, తాటకోటి సూర్యప్రకాష్, మానేపల్లి నాగేశ్వరరావు, కెల్లా దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నానో టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు


నానో టెక్నాలజీపై సెమినార్ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నానో టెక్నాలజీ పరిచయం అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక అనేక పరిశోధనలకు పునాది నానో శాస్త్రం అని, ఈ శాస్త్ర అధ్యయనం మూలంగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని అన్నారు.ముఖ్య వక్త హైదరాబాద్ జే.ఎన్.టీయూ ఆచార్యులు, నానో శాస్త్ర విభాగ అధ్యక్షుడు డైరెక్టర్ ఆఫ్ ఇవాల్యూయేషన్స్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నానో పదార్థంగా గుర్తించే అంశాలు, నానో శాస్త్రంలోని మౌలిక అంశాలు, నూతన పరిశోధనలు, దీని మూలంగా వికసించిన విప్లవాత్మకమైన మార్పులను విద్యార్థులకు వివరించారు. నానో శాస్త్రంలో భాగంగా మనం ధరించే వస్త్రాలలో నూతన ఆవిష్కరణ కారణంగా వస్తున్న మార్పులను వివరిస్తూ ఉతకడం, ఇస్త్రీ అవసరంలేని వస్త్రాలు, కడగడం అవసరంలేని పాత్రలు, మొదలైన మార్పులను వచ్చాయన్నారు. ప్రకృతిలోని సహజసిద్ధమైన చర్యల ఆధారంగా నానోశాస్త్రంలో పరిశోధన జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మరో వక్త గీతం విశ్వవిద్యాలయ పరిశోధకులు చేబ్రోలు ప్రసాద్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు బొగ్గల వెంకటేశులు రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి తదితరులు ప్రసంగించారు. విద్యార్థులు వారి సందేహాలను ప్రధాన వక్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గాదేవి తెప్పోత్సవం


సదాపురం కోనేరులో కనకదుర్గాదేవికి తెప్పోత్సవం

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు సదాపురంలో కనకదుర్గాదేవి ఆలయంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్థానిక కోనేరులో తెప్పోత్సవం కనుల వేడుకగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పడవలో అమ్మవారికి ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకను తిలకరించి అబ్బురపడ్డారు. కోనేరు చుట్టూ విద్యుత్ దీపాలు, బాణసంచా కాల్పులతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. శనివారం ఉగాది ఉత్సవ ముగింపును పురస్కరించుకుని ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


వార్షికోత్స వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఉంగుటూరు: మండలంలోని కాగుపాడు-1 ఫౌండేషన్ ప్లస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, పి.సి.కమిటీ చైర్మన్ బొద్దూరి అప్పన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ కడియాల సుదీప్ష మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధాశక్తులతో విద్యను అభ్యసించాలన్నారు. ఎంఈవో లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ వెలికి తీయడానికి వార్షికోత్సవ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. గ్రామ పెద్దలు కడియాల చిట్టిబాబు, మట్టా వెంకటేశ్వరరావు, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, ఉపాధ్యాయులు రమాదేవి, శీతాల సత్యనారాయణ, శ్రీధర్ రాంబాబు, జోగినాయుడు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి నూతిలో పడి చిన్నారి మృతి


నూతిలో పడి మృతి చెందిన గగన్‌తేజ (ఫైల్)

పెదవేగి : మండలంలోని న్యాయంపల్లిలో మరుగుదొడ్డి కోసం తవ్విన నూతిలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దేవరపల్లి రవి, వెంకటేశ్వరమ్మకు 10 నెలలు, 23నెలల వయస్సు ఉన్న ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. 23నెలల వయస్సు ఉన్న బాలుడు వారి ఇంటికి సమీపంలో తాతయ్య, నానమ్మల ఇంటికి వెళ్లి ఆడుకుంటాడు. ఈ క్రమంలో శనివారం బాలుడు గగన్ తేజ నానమ్మ ఇంటికి వెళ్లాడు. నానమ్మ దెందులూరు వెళ్లగా తాతయ్య ఇంటి దగ్గర ఉన్నాడు. కొత్తగా నిర్మించుకున్న రేకుల షెడ్డు ఇంటి దగ్గర ఇటీవల మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. దీనికోసం నుయ్యి తవ్వి దానిపై రక్షణగా సిమెంట్ రేకును ఉంచారు. కొద్దిసేపటికి బాలుడు కనిపించకపోయేసరికి అతని తాతయ్య కుమారుడి ఇంటికి వెళ్లి కోడలితో కలిసి చుట్టు పక్కల వెతికారు. నుయ్యిపై ఉన్న రేకు కొంత పక్కకు జరిగి ఉండడంతో అనుమానం వచ్చి, నూతిలో చూడగా నీటిలో విగతజీవుడై గగన్‌తేజ(23నెలలు) కనిపించాడు. స్థానికంగా వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాలుని మృతితో ఆ కుటుంబం బోరున విలపిస్తోంది. వచ్చేనెల 18వ తేదీన రెండో పుట్టిన రోజుకోసం ఎదురుచూస్తున్నామని. ఇంతలోనే ఇంత విషాదం జరిగిందని తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

దంత కళాశాలలో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం


సెయింట్ జోసెఫ్ దంత కళాశాల్లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తున్న ఆర్చ్ బిషప్ ఆంథోని

పెదవేగి : పేద ప్రజలకు ఉన్నత సేవలందించడంలో రోమన్ క్యాథలిక్ సంస్థ అగ్రగామిగా నిలుస్తుందని మోస్ట్ రెవరెండ్ కార్డినల్ ఆర్చ్ బిషప్ పూల అంథోని అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో తెలుగు బిడ్డ మోస్ట్ రెవరెండ్ పూల అంథోని కార్డినల్ కళాశాలకు శనివారం విచ్చేశారు. మొట్టమొదటిసారిగా తెలుగు వ్యక్తి, హైదరాబాదులో అగ్ర పీఠాధిపతిగా ఉన్న పూల అంథోనిని రోమన్ క్యాథలిక్ ఫ్రాంచెస్ పోపు కార్డినల్‌గా నియమించారు. ఈయన శనివారం కళాశాలకు విచ్చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా కళాశాల ఫౌండర్ చైర్మన్ బిషప్ జాన్ ములగడకి నివాళులర్పించి, పునీత జోసఫ్‌కి ప్రార్థనలు చేశారు. పూల అంథోనిని ఏలూరు పీఠాధిపతులు సెయింట్ జోసెఫ్ కళాశాల చైర్మన్ మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర కలిసి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను కళాశాలలో ప్రారంభించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బిషప్ జయరావు ఏలూరు పీఠాధిపతిగా పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన పేరున డెంటల్ మ్యూజియంని ఆంథోని ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ మోజెస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అంథోని, జయరావు కలిసి ఫాదర్ మోజెస్‌ను, ఫాదర్ ఫెలిక్స్‌ను సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు, ఏలూరు పీఠంలోని వికార్ జనరల్ పి బాల, చాన్సలర్ బాబు జార్జ్, మెంబర్ ఫాదర్ మైకేల్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, కరస్పాండెంట్ ఫాదర్ జాకబ్, గురువులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను శాఖలో ఉద్యోగాలు

ఏలూరు రూరల్: ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల నియామకం చేపట్టిందని జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి నెల రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గేమ్స్, స్పోర్ట్స్‌లో 65 క్రీడాంశాల్లో ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గల బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలో గల గిరిజన సంక్షేమ ఏకలవ్య గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి, ఖాళీగా ఉన్న 8వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశానికి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ పీఏఎస్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. బాలికలు - 30 సీట్లు, బాలురు - 30 చొప్పున మొత్తం 60 సీట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 30వ తేదీన ఏకలవ్య గురుకుల పాఠశాల ఇప్పలపాడులో ప్రవేశ పరీక్ష జరుగుతుందని అన్నారు.

ఘనంగా చల్లాలమ్మ ఉత్సవాలు


చల్లాలమ్మ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గరగలను తీసుకువెళుతున్న భక్తులు


చల్లాలమ్మ ఉత్సవాల్లో భాగంగా కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని శనివారం కాలవతల పేట, సాలిపేట, ఎర్రచెరువు రోడ్డు, హైస్కూల్ ప్రాంతాల్లో ఊరేగించారు. ఇంటికి వచ్చిన అమ్మవారిని మహిళలు భక్తి శ్రద్ధతో పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం రాత్రి డాన్స్ బేబీ డాన్స్ నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ప్రదర్శించిన మనుషులు మారాలి నాటికలో ప్రధాన పాత్ర, సూత్రధారుడు చల్ల సూర్యారావు అనే కళాకారుడిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

పేదలకు భూమి పంచిన బాపనయ్య

ఏలూరు (టూటౌన్) : జమిందారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడి పేదలకు భూమి పంచిన నేత గుంటూరు బాపనయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. బాపనయ్య 45వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక అన్నే భవన్‌లో బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రామకృష్ణ, పి.కిషోర్, జవీఎల్ నరసింహారావు, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, ఎ.శ్యామల రాణి, టి.సత్యనారాయణ, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్ అవగాహన ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు, విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మార్చి నెల చివరి శనివారం నిర్వహించే ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నగరంలో ఎర్త్ అవర్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోని విద్యుత్ ఉపకరణాలను ఒక గంట పాటు ఆపివేసి ఎర్త్ అవర్ పాటించాలని, విద్యుత్ పొదుపుతో భూమిని, పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదాలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2007వ సంవత్సరంలో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే వాతావరణ దినోత్సవం గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థంగా మారినందున భూమిని కాపాడుకోవడానికి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్థానిక అమీనాపేటలోని బాలయోగి సైన్స్ పార్క్ నుంచి హాస్టల్ ప్రాంగణాల వరకు ఏలూరులోని వివిధ పాఠశాలల ఎకో క్లబ్ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు.